క్లుప్తంగా

కార్యకర్తలు ఐకమత్యంగా ఉండాలి

కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు



అమ్మవారిని దర్శించుకుంటున్న హన్మంతరావు

రామాయంపేట(మెదక్): గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఐకమత్యంలో మెలగాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు సూచించారు. మంగళవారం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అక్కడికి వచ్చిన కార్యకర్తలతో మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. అంతకు ముందు ఆలయ నిర్వాహకులు పల్లె శ్రీనివాసగౌడ్ హన్మంతరావును సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. పీసీసీ కార్యదర్శి సుప్రభాత్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గంగ నరేందర్, పార్టీ పట్టణ కార్యదర్శి వెంకటేశ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ



హోమం చేస్తున్న భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దేవతాపూజ, దేవతా హవనము, మంత్ర జపానుష్టానం, హోమం, ఫల, పుష్ప, శయ్యాది వాసములు, ప్రసాద సంస్కరము, న్యాసదులు, అర్చన, మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం నిర్వహించారు.

మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కుకునూర్‌లో జెండా ఊరేగిస్తున్న భక్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని భస్వాపూర్‌లో స్వయంభుగా వెలసిన భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయ 46వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు కుకునూర్ గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి భస్వాపూర్ మల్లన్నగుట్ట వరకు భక్తులతో జెండా ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, ఋుత్విక్కరణం, అఖండ దీపస్థాపన, ధ్వజారోహణం, దేవతా ఆవాహనము, కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ వంటి పూజలు నిర్వహించారు.

సీఐ, ఎస్‌ఐని కలిసిన నాయకులు



సీఐతో నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): నూతనంగా బాధ్యతలు చేపట్టిన పోలీసు అధికారులను బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బదిలీపై వచ్చిన తూప్రాన్ సీఐ కృష్ణ, శివ్వంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డిని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మహేష్‌గుప్తా, హంసన్‌పల్లి నర్సింహారెడ్డి, కల్లూరి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం

పాపన్నపేట(మెదక్): అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణపై దాడి అమానుషమని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజేశ్వర్, పార్శి నర్సింలు, విఠల్ అన్నారు. వారు మంగళవారం మాట్లాడుతూ.. ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు ఫిర్యాదు చేయాలి. కానీ భౌతిక దాడికి పాల్పడటం సరి కాదని అన్నారు. బాధ్యులపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

జాగ్రత్తగా డ్రైవింగ్ చేయండి

హెల్మెంట్ తప్పనిసరి

● రామాయంపేట సీఐ వెంకటేష్



చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేష్

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని రామాయంపేట సీఐ వెంకటేష్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో విలువైన ప్రాణ రక్షణకు సేఫ్ డ్రైవింగ్‌తో పాటు హెల్మెంట్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ప్రమాదాల నివారణకు రహదారి నిబంధనలు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రయాణ సమయంలో హెల్మెంట్ ధరించడం, సీట్‌బెల్ట్ పెట్టుకోవడం తప్పనిసరి అన్నారు. అలాగే విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆత్మవిశ్వాసంతో చదివితేనే పరీక్షలు బాగా రాయగలమన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, అధ్యాపకులు వేణుమాధవ్ ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

అల్లాదుర్గం(మెదక్): జాతీయ రహదారిపై ప్రయాణాలు చేసే సమయంలో నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. 161వ జాతీయ రహదారి పెద్దాపూర్ గ్రామ సమీపంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. చిల్వెర, మాదాపూర్, రాంపూర్, పెద్దాపూర్, ఐబీ.తాండా, సీతానగర్ తదితర గ్రామస్తులు బైక్‌లపై ప్రయాణించే సమయంలో రాంగ్‌రూట్లో వెళ్లొద్దని, ప్రమాదాలు జరిగితే బీమా వర్తించదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. నెంబర్ ప్లేట్‌లను మార్చుకొని రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించండి

ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి



కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతీ ఒక్కరు కచ్చితంగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ రోడ్డుపై వెళ్లేప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చెప్పారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని సెల్‌ఫోన్ వాడేటప్పుడు అవసరంలేని లింకులు ఓపెన్ చేయకూడదన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నేరమని చెప్పారు. విద్యార్థినులకు ఏదైన సమస్య ఉంటే చెప్పాలని, బాలికలకు బ్యాడ్ టచ్ గుడ్ టచ్‌పై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ విఠల్, హెచ్‌ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు శేశగిరిరావు, శేక్‌బబ్బు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించండి



వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

మెదక్ కలెక్టరేట్: అంగన్‌వాడీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ చిరంజీవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. : అంగన్‌వాడీ ఉద్యోగులకు డిసెంబర్, జనవరి నెలల వేతనాలు చెల్లించకపోతే ఏమి తిని పని చేస్తారని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామాల్లో తల్లులకు, గర్భిణులకు, పిల్లలకు పోషకాహారం అందించే వారికే వేతనాలు ప్రతీ నెల చెల్లించకపోతే ఎలా బతుకుతారని వాపోయారు. అంగన్‌వాడీలకు జీతమే జీవనాధారమని, వేరే ఆర్థిక అవకాశాలు ఏమి లేవని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం 1న జీతాలు చెల్లిస్తూ... గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించే వారికే చెల్లించక పోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో : అంగన్‌వాడీ సిబ్బంది యాదమ్మ, ప్రమీల, భవాని, సుగుణ, మంగ, వీరమ్మ, ముద్రద్ ఉన్నిసా, భాగ్యలక్ష్మి కమల, స్వరూప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందదిస్తున్న పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామ పంచాయతీ వేతనాలు వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి వినతిపత్రాన్ని అందజేశారు. వీరి వెంట స్వామి, ఏల్లమ్మ, నవనీత, శోభ తదితరులున్నారు.

సీసీ రోడ్లకు నిధులు మంజూరు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ 1.05కోట్లు మంజూరు అయినట్లు ఎంపీఓ కలీముల్ల, పీఆర్ ఏఈ ప్రభాకర్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రం కౌడిపల్లికి రూ. 10లక్షలు, మరో 19 గ్రామ పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి రూ. 5లక్షల చొప్పున నిధులు మంజూరు అయినట్లు చెప్పారు. నిధులు ఖర్చుచేసేందుకు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తీర్మానం చేసి ఇవ్వాలని చెప్పారు.

రామాయంపేట ఎక్సైజ్ సీఐ బదిలీ

రామాయంపేట(మెదక్): రామాయంపేట ఎక్సైజ్ సీఐ జయసుధ బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో బోధన్ సాలూరా చెక్ పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న రాణిని నియమిస్తున్నట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

చట్టాలను గౌరవించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రజనికుమారి

రామాయంపేట(మెదక్): రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం రామాయంపేటలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు వినోద్‌కుమార్, మధుకిరణ్ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడుల విషయమై చట్టాలు కఠినతరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని, యువత సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. చిన్న, చిన్న కేసులుంటే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సాయం, సలహాలు, అందిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ రజనికుమారి మాట్లాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిద్దాగౌడ్, సిద్ధిరాంలు, రామాయంపేట సీఐ వెంకటేశ్, తహసీల్దార్ రజనికుమారి, ఏఎస్‌ఐలు, పంచాయతీ కార్యదర్శులు, షీం టీం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



మండల పరిధిలోని ఉత్తులూర్ గ్రామ శివారులోని రేణుకా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా గ్రామ వీధుల గుండా మహిళలు బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. శివసత్తుల నృత్యాలు అకట్టుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- పెద్దశంకరంపేట(మెదక్)

15 నుంచి తిరుమలస్వామి బ్రహ్మోత్సవాలు



పశ్చిమాభిముఖంగా ఉన్న స్వామివారి విగ్రహం

నిజాంపేట(మెదక్): భక్తులకు కోరిన కోరికలు తీర్చే స్వయంభువుగా తిరుమల స్వామి అవతరించాడు. రథసప్తమిని పురస్కరించుకొని జరిగే బ్రహ్మోత్సవాలు కనుల పండుగగా జరుగుతాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాది మంది ప్రజలు వస్తారు. ఈ స్వామివారు పశ్చిమ ముఖంగా కొలువుదీరారు. ఈ స్వామివారికి ఎదురుగా ఉన్న పుష్కరిణి ఎప్పుడు ఎండిపోదు. ఇందులో స్నానమాచరిస్తే సర్వరోగాలు పోతాయని భక్తుల నమ్మకం.

ఉత్సవాల వివరాలు

ఈ నెల 15 నుంచి ప్రారంభమెయ్యే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు గురువారం శాంతి పాఠం, రక్షబంధనం, పుణ్యావాచనం, అంకురార్పణం, ఆరగింపు, తీర్థ ప్రసాద గోష్టి, 16న ధ్వజారోహణం, దేవతాహ్వాణయు, మూలామర్తుల అభిషేకం, అలంకారం, నైవేద్యం, కల్యాణం, హోమం, బండ్లు తిరుగుట, 17న బాలబోగం, నిత్యాహోమం, అభిషేకం, అలంకారం, గరుడోత్సవం, నైవేద్యం, హారతి, తీర్థప్రసాద గోష్టి, ఆరాధన, నిత్యహోమం, రథోత్సవం, ఆరగింపు, హారతి, తీర్థప్రసాదగోష్టి, 18న నిత్యాహోమం, పూర్ణహుతి, శతఘటాభిషేకం చక్రతీర్థ, నైవేద్యం, హారతి, తీర్థప్రసాద గోష్టి, ద్వాదశరాధన, ఏకాంతసేవ, పండిత సన్మానంతో సమాప్తి జరుగును.

ఏర్పాట్లు చేస్తున్నాం



బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఆలయ ప్రాగంణంలో భక్తులకు ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాట్లు చేశాం. పోలీసుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాం. జాతరలో సీసీ కెమెరాతో ఎల్లప్పుడు పర్యవేక్షిస్తున్నాం. - మోహన్‌రెడ్డి , ఆలయ దేవాదాయ శాఖ అధికారి

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ



కౌడిపల్లిలో ఎంపీఓ కలీముల్లకు సమ్మె నోటీసు అందిస్తున్న నర్సమ్మ

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీఓ కలీముల్లకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందలేదన్నారు. కార్మికులకు ప్రతిరోజు భోజన విరామ సమయం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎల్లం, రాజు, సామేల్, లింగం, సాయిలు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పల్లెకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

మెదక్ ఎమ్మెల్యే రోహిత్



పాడిచన్‌పల్లి తండాలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

పాపన్నపేట(మెదక్): నియోజకవర్గంలోని ప్రతీ పల్లెకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని పొడిచన్‌పల్లి తండాలో ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో వేస్తున్న సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి ఎన్‌ఆర్జీఎస్ ద్వారా రూ.3 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. ఇందులో ప్రతీ గ్రామానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు. 6 గ్యారంటీల పథకాలను తప్పకుండా అమల్లోకి తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గోవింద్ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, సతీష్, శ్రీధర్, సత్యనారాయణ, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, నాయకులు ఉన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మాచవరం గ్రామంలో మంగళవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫిజుద్దీన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్, మోహన్‌గౌడ్, మేకల ఆంజనేయులు, సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాస్‌చౌదరి తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



మనోహరాబాద్(తూప్రాన్): ఉపాధ్యాయులతో విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో మంగళవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. హెచ్‌ఎంగా శ్రీరాం, ఎంఈఓగా ఆదిత్యచరణ్, డీఈఓగా ప్రణవ్, కాంప్లెక్స్ హెచ్‌ఎంగా భవ్యశ్రీ, అంజలి ఉపాధ్యాయులుగా అనువర్షిని, జోత్స్న లక్ష్మీప్రసన్న, ఇందూ, మేఘన వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంగా నీరజ, పాఠశాలహెచ్‌ఎంగా సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు బోధించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. జెడ్పీ చైర్ పర్సన్‌గా భానుశ్రీ, డీఈఓ రాంచరణ్, ఆర్జేడీగా లోహిత, కలెక్టర్‌గా కోమల్, ఎంపీపీగా జ్యోత్స్న, ఎంఈఓగా భానుప్రసాద్, హెచ్‌ఎంగా కావ్య, ఎస్‌ఎంసీ చైర్మన్‌గా ప్రవీణ్‌లు వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేసినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం కృపాకర్‌రెడ్డి తెలిపారు.



చేగుంట(తూప్రాన్): వడియారంలో..

సంక్షిప్త వార్తలు

◆ **రామాయంపేట పంచాయత్‌రాజ్ డిప్యూటీ ఈఈగా ఈశ్వర్ నాయక్**



రామాయంపేట(మెదక్): పట్టణంలోని పంచాయత్‌రాజ్ డిప్యూటీ ఈఈగా ఈశ్వర్‌నాయక్ నియమితులయ్యారు. ఐదు నెలల క్రితం రామాయంపేటకు పంచాయత్‌రాజ్‌శాఖ కార్యాలయం మంజూరు కాగా, మెదక్‌లో పనిచేస్తున్న పాండురంగారెడ్డి ఇన్‌చార్జి డిప్యూటీ ఈఈగా కొనసాగారు. సంగారెడ్డి సబ్ డివిజన్ కార్యాలయంలో ఏఈగా పనిచేస్తున్న ఈశ్వర్‌నాయక్ పదోన్నతి పొంది రామాయంపేట డిప్యూటీ ఈఈగా బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈశ్వర్‌నాయక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కలిశారు.

◆ **స్పెషల్ శానిటేషన్ డ్రైవ్**



నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామంలో మంగళవారం డివిజనల్ పంచాయతీరాజ్ అధికారి సతీష్ కుమార్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను పర్యవేక్షించారు. ఈ మేరకు గ్రామంలో జరిగే డిజిటల్ అక్షరాస్యత సర్వేను పరిశీలించారు. అనంతరం రజాక్‌పల్లి గ్రామంలో మొబైల్ ఆఫ్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి, గ్రామంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు ఆరిఫ్ హుస్సేన్, గీతాంజలి, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన**

శివ్వంపేట(నర్సాపూర్): జాతీయ విపత్తు నిర్వహణపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు శివ్వంపేటలోని రైతు వేదిక వద్ద నిర్వహించే అవగాహన సదస్సుకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ **పుకార్లు నమ్మొద్దు**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో చిన్న పిల్లలను ఎత్తుకపోయే ముఠా గ్రామాల్లో తిరుగుతున్నారని వస్తున్న పుకార్లను నమ్మొద్దని ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలో ఇలాంటి సంఘటనలు ఎక్కడా.. జరగలేదని చెప్పారు. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **మల్లికార్జునస్వామి జాతర**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి జాతర కనుల పండువగా కొనసాగుతోంది. అందులో భాగంగా రెండో రోజు మంగళవారం నిర్వాహకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి ఓడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర బీజేపీ నాయకులు మల్లేశ్‌గౌడ్, నిర్వాహకులు, యాదవ సంఘం నాయకులు మల్లేశ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



బావిలో పడ్డ వ్యక్తిని రక్షించిన ఫైర్ సిబ్బంది

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు పాడుబడ్డ బావిలో పడిపోగా, ఫైర్ సిబ్బంది రక్షించారు. ఘట్‌కేసర్‌కు చెందిన నిరంజన్ రామాయంపేటలోని తన బంధువుల వద్ద నుంచి అక్కన్నపేట రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. అక్కడ రోడ్డు పక్కన మూత్ర విసర్జనకు వెళ్లిన అతను ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న పాడుబడ్డ బావిలో పడిపోయాడు. బావిలో నుంచి అతని అరుపులు విన్న గ్రామస్తులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందజేయగా, వారు వెళ్లి అతన్ని బయటకు తీశారు.